ప్రజాశక్తి

ఆదివారం 1 డిసెంబర్ 2024

8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

దీపం కోసం ఎదురుచూపు

- సిలిండర్‌కు రూ.3.90 జమ
- రెండు వారాలవుతున్నా పడని రాయితీ



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి పట్టణానికి ఆనుకొనివున్న కొత్తూరు పంచాయతీలోని శారదనగర్ 11 వీధిలో నివాసముంటున్న కె ఈశ్వరరావు అప్న ఇండేన్ సర్వీస్ అడహక్ పాకాసాసా గ్యాస్ ఏజెన్సీ నుంచి నవంబరు 15న యథావిధిగా రూ.850 చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకున్నాడు. వినియోగదారుని నెంబరు 7553204813. ఆధార్, ఫోన్ నెంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానంతో ఈకెవైసి చేసుకున్నాడు. అయినా 29వ తేదీ వరకు ఆయన బ్యాంకు ఖాతాలో రాయితీ సొమ్ము జమకాలేదు. గతంలో వలె రూ.3.90 పైసలు జమైనట్లు ఆయన ఫోన్ నెంబర్‌కు సమాచారం వచ్చింది. తనకు ఉచిత గ్యాస్ రాయితీ సొమ్ము పడని విషయం ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదని ఈశ్వరరావు వాపోయాడు. ఇతని వలె గ్యాస్ రాయితీ సొమ్ము పడనివారు అనేక మంది ఉన్నారు.

దీపం-2 పథకం అమల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. ఈకెవైసి చేసుకున్నా లబ్ధిదారులందరికీ రాయితీ సొమ్ము జమకావడంలేదు. టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేసినా పరిష్కారం కావడంలేదు. సిలిండర్ అందిన కొద్ది రోజుల వ్యవధిలో కొందరి ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. కొందరికి వారం రోజులు పడుతోంది. ఈశ్వరరావు వలె కొందరికి రెండు వారాలవుతున్నా రాయితీ సొమ్ము జమకావడంలేదు. సకాలంలో డబ్బులు జమకాకపోవడంతో ఉచిత గ్యాస్ తమకు వర్తించదన్న ఆందోళనలో లబ్ధిదారులున్నారు. గ్యాస్ రాయితీ సొమ్ము జమకాక నిరాశ చెందుతున్నారు. సిలిండర్ అందిన 48 గంటల్లో రాయితీ సొమ్ము లబ్ధిదారుల

మిగతా 2లో..



వార్త 7లో...

అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో నేలకొరిగిన వరి పంట

వర్షంతో వరి పంటకు నష్టం

అదానీ సంస్థతో ఒప్పందాలన్నీ అక్రమమే

సదస్సులో అజశర్మ, గంగారావు

వార్త మెయిన్‌లో..

మాట్లాడే మనుషులు కావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'మనుషులు మాట్లాడాల్సిన రోజొచ్చింది. తప్పొప్పులను పరికించి ప్రశ్నించాల్సిన సమయం మందుకొచ్చింది. కథలు చెప్పి ఎతలుపెట్టే మనిషెవరైనా, ఎంత శక్తివంతులైనా సమ న్యాయం, సమ ధర్మం కోసం సమూహంగా కదలాలి. కనబడినవాడే కాదు, వెనుక నుంచి విషం చిమ్మి, వ్యవస్థను అవస్థలుపాల్జేస్తున్న వంచకులు ఏ పక్షంవారైనా ఒక్కటే. సమాజాన్ని చెరపటానికి. చెట్టుకు పట్టిన చీడ, వ్యవస్థను చుట్టిన పీడ మహా ప్రమాదం కదా! ప్రజల సంపదను దోచుకొని, సమాజ వనరులను చేతుల్లో పెట్టుకొనేందుకు సంధించిన అవినీతి అస్త్రాలకు లొంగిపోయే దొంగలను ఏకాకులు చేసేందుకు ప్రతీపౌరుడు ఆలోచించి కదలాలి.

సవ్యంగా నడిచే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం ఎన్ని ముప్పతిప్పలు పెడుతుందో చూస్తూనేవున్నాం. ప్లాంట్ పురోగతికి సహకరించని, ప్రోత్సహించని మోడీ ప్రభుత్వం, కావాల్సిన వారికి కట్టబెట్టడానికి పడరానిపాట్లు పడుతోంది. కుట్రలు చేస్తోంది. కుతంత్రాలకు పాల్పడుతోంది. స్టీల్‌ప్లాంట్ చరిత్ర, దాని ఎదుగుదల, కీర్తి, అందులో కార్మికులు, ఉద్యోగుల కృషి మరుగునపడిపోయేదేమీకాదు. కేంద్రం సొంత గనులు కేటాయించకపోయినా, కేటాయించి ప్లాంట్‌ను నిలబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలు అడగకపోయినా, అడగలేకపోయినా దాని వైభవాన్ని కాపాడుకుంటూవస్తున్నారు కార్మికులు, ఉద్యోగులు. అదానీకి చెందిన గంగవరం పోర్టును అడ్డంపెట్టుకొని ముడిసరుకు కొరత సృష్టించారు. గంగవరం పోర్టులోని 10.4 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాలను మోడీ ప్రభుత్వ ఒత్తిడితో అదానీకి వైసిపి ప్రభుత్వం చౌకగా అప్పగించింది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దుతామంటున్న కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు ప్రభుత్వ వాటా అదానీకి అమ్మడంపై నోరు విప్పడంలేదు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు ప్రతినెలా జీతాలు ఇవ్వకుండా హింసపెడుతున్నా ప్రభుత్వంగానీ, స్థానిక ఎమ్మెల్యే



ఎంపీగానీ జోక్యం చేసుకోవడంలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ శ్వాస తీసి, నక్కపల్లి ప్రాంతంలోని ప్రయివేటు మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ప్రాణ ప్రతిష్ఠ చేయాలని మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు చూస్తున్నాయి.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఇలా దెబ్బతీసి, మిట్టల్‌ను మోసే పనిలో ప్రభుత్వాలున్నాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు గ్యారంటీ లేకపోయినా ఆ కంపెనీకి లెక్కకు దొరకని రాయితీలు ఇవ్వడానికి, ప్రయోజనాలు కల్పించడానికి సిద్ధపడుతున్నాయి. ఇదే సమయంలో అక్కడ భూములు కోల్పోయిన నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం, ప్యాకేజీ చెల్లించడానికి ఈ ప్రభుత్వానికి చేతులురాలేదు. భూములు కోల్పోయిన మత్స్యకారులు, రైతులు, వృత్తిదారులు రేపెలా బతుకుతారని కూడా ఆలోచించడంలేదు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమాధిపతులను సంతృప్తిపర్చలేకపోయినట్లు భావిస్తున్న ప్రభుత్వం, తాజాగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో కార్మికుల హక్కులపై దాడి పెంచి, వారిని భుజానకేసుకొని మోయాలని చూస్తోంది. ఈ క్రమంలో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతను యాజమాన్యం దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. యాజమాన్య నిర్లక్ష్యంతో జరిగిన ప్రమాదాలని తెలిసినా, వారిపై చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడుతోంది. ఆగస్టులో అసెన్షియాలో జరిగిన ప్రమాదంలో 17 మంది, సీనర్జిన్‌లో నలుగురు, తాజాగా ఠాగూర్ లేబొరేటరీ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. అసెన్షియాలో 38 మంది, ఠాగూర్‌లో 28 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదాలేవీ ప్రభుత్వాధి నేతల మనసును కరిగించలేకపోతున్నాయి. తమకు జరుగుతున్న అన్యాయంపై కార్మికులే కదలాలి. చేజారిపోతున్న హక్కుల పరిరక్షణకు రాజకీయాలకు అతీతంగా ఒక వేదికపైకి రావాలి. తాము పనిచేసిన పరిశ్రమలో, ప్రాంతంలో కార్మిక ప్రయోజనాలు, హక్కులకు ఉద్యమించే కార్మిక సంఘం ఏర్పాటుచేసుకోవాలి. ప్రభుత్వాల మాయలో పడి మోసపోకుండా, యజమానుల బెదిరింపులకు భయపడకుండా, నూతన చైతన్యంతో తమ బతుకులను బాగుచేసుకొనేందుకు సంఘం గొడుకు కిందకు కార్మికులంతా చేరాలి. అన్యాయంపై మాట్లాడే గొంతులన్నీ ఒకచోటకు చేరాలి.

మొదటి పేజీ తరువాయి..

దీపం కోసం ఎదురుచూపు

ఖాతాలో జమవుతుందని ప్రభుత్వం చెప్పింది. కానీ, అమల్లో ఇంకా లోపాలు కొనసాగుతున్నాయి. ఫిర్యాదు చేసినా ఫలితం కన్పించడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఏడాదిలో నాలుగు నెలలకు ఒకటి చొప్పున మూడు సిలిండర్లు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనుంది. అందులో భాగంగా తొలి దశలో సిలిండర్‌కు రాయితీ సొమ్ము రాకపోవడంతో మిగిలిన రెండు సిలిండర్లకు డబ్బులు రావన్న నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 5.17 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో దీపం, ఉజ్వల-1, ఉజ్వల-2, సిఎస్ఆర్ (ఫ్రీ), సాధారణ కేటగిరీలో గ్యాస్ కనెక్షన్ పొందిన 3.60 లక్షల మందిని ఉచిత గ్యాస్ పొందడానికి అర్హులుగా అధికారులు గుర్తించారు. ఇప్పటికి 1.37 లక్షల మంది ఉచిత గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకున్నారు. గ్యాస్ రాయితీ సొమ్ము రూ.807లు తమ ఖాతాలో జమైనట్లు సమాచారం రాక రోజూ బ్యాంకులకు వెళ్లి రాయితీ సొమ్ముపై అడిగి తెలుసుకుంటున్నారు. అయితే అధికారులు మాత్రం సిలిండర్ తీసుకున్న వారందరికీ రాయితీ సొమ్ము జమవుతుందని చెబుతున్నారు.

'టాప్ హాట్స్ అండ్ టాల్ కోట్స్' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : డాక్టర్ ప్రయాగ మురళీ మోహన్‌కృష్ణ రచించిన 'టాప్ హాట్స్ అండ్ టాల్ కోట్స్' ఆంగ్ల గ్రంథాన్ని శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని హిందీ భవన్‌లో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ, రచయిత డాక్టర్ ప్రయాగ మురళీ మోహన్‌కృష్ణ తన గ్రంథంలో భారతీయతను ఆవిష్కరించే ప్రయోగం చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదివి దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలని సూచించారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులు పుస్తకంపై అభిప్రాయాలను పంచుకున్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఎన్‌హెచ్ఎం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విశాఖపట్నం : నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ విశాఖపట్నం జిల్లా నూతన కమిటీని శనివారం జరిగిన సమావేశంలో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు ఎన్నుకున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా నూతన అధ్యక్షులుగా ఆర్.సురేష్, గౌరవాధ్యక్షులుగా జి.శశిభూషణరావు, ప్రధాన కార్యదర్శిగా వి.వీరబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కెసిహెచ్.నాగరాజు, పాధ్యక్షులుగా ఎన్.మోహనరావు, కోశాధికారిగా ఎంవివి గోపీనాథ్ ఎన్నికయ్యారు. అనేక ఏళ్ల నుంచి పనిచేస్తున్న హెల్త్ మిషన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కమిటీ డిమాండ్ చేసింది.

16 నుంచి వెంకటేశ్వరస్వామి ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లిపురం వెంకటేశ్వర మెట్టపై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో డిసెంబర్ 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి.వి.రమాబాయి తెలిపారు. డిసెంబర్ 16వ తేదీ ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ఈ సందర్భంగా నెలగంట పెడతారని చెప్పారు. ఆ రోజు ఉదయం 6.42 గంటలకు ధనుర్మాస పూజ జరుగుతుందని అన్నారు. ఉదయం 11:30 గంటలకు కవాట బంధనం దర్శనాలు నిలిపివేస్తారని, సాయంత్రం 5 గంటల నుండి ఆరాధన, మంగళ శాసనం తీర్థ ప్రసాద వితరణ,రాత్రి 8 గంటలకు ఏకాంత సేవ ఉంటుందన్నారు. జనవరి 10,11 తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ఉత్తరద్వార దర్శనం, 12న నీరాటోత్సవం,13 భోగి పండుగ, గోదాదేవి కల్యాణం, 14 మకర సంక్రాంతి, పుణ్యకాలం, పండుగ, 15న కనుమపండుగ, 16న ముక్కనుమ పండుగ, పరస, 19న అన్నదాన కార్యక్రమం ఉంటాయని తెలిపారు.

వైజాగ్ మీడియా క్రికెట్ టోర్నీ ట్రోఫీ, పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ మీడియా క్రికెట్ టోర్నీ -2024 ట్రోఫీ, పోస్టర్‌ను శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంట శ్రీను బాబు మాట్లాడుతూ నిరంతరం వార్తల సేకరణలో మునిగి ఉన్న జర్నలిస్టులకు ఆట విడుపు కోసం ఈ క్రీడలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, వైజాగ్ మీడియా క్రికెట్ టోర్నీ వచ్చేనెల డిసెంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గిన జర్నలిస్టు క్రీడాకారులు 7వ తేదీ లోపు తమ టీం జాబితాలను నిర్వాహకులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు గాజుల గురు ప్రసాద్ రావు, సూర్య ప్రకాష్ రెడ్డి, కె.మదన్, అమిత్, నారాయణరావు, దేవ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

యుజిడి, కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : యుజిడి, అవుట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేసి, జిఒ 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500 చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు డిమాండ్ చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యుజిడి, ప్లాంట్లు, దానికి అనుసంధానంగా పంపు హౌస్‌లలో పనిచేస్తున్న వారికి జిఒ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని జివిఎంసి కమిషనర్‌కు యూనియన్ తరపున కోరిన తర్వాత జివిఎంసి అధికారులు ప్రభుత్వ అనుమతి గురించి లేఖ రాశారని తెలిపారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ఈ.ఆదినారాయణ, జెఆర్.నాయుడు, గొలగాని అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగులకు ఆరోగ్య సేవల్లో భాగంగా మెడికవర్ హాస్పిటల్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యాన జిల్లా ప్రజా పరిషత్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఏటా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ ఉద్యోగులకు బిపి, సుగర్, ఇసిజి, కేన్సర్ స్క్రీనింగ్ తదితర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు సిఇఒ పి.నారాయణమూర్తి, జిల్లా గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎస్.సత్తిబాబు, పరిపాలనాధికారి ప్లానింగ్ పివివిఎన్.మూర్తి పాల్గొన్నారు.

కనులపండువగా అనంతుని దీపోత్సవం



కొండ మెట్ల మార్గంలో దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు

- వర్షపు జల్లుల్లోనూ పోటెత్తిన భక్తులు
- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రజాశక్తి-పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి కొండపై దీపోత్సవం కనులపండువగా సాగింది. తుపాన్ ప్రభావంతో వీడకుండా జల్లులు కురుస్తున్నప్పటికీ, అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపోత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవానికి తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దేవస్థానం ఇఒ నానాజీబాబు ఆధ్వర్యంలో అధికారులు, మధురవాడ ఎసిపి బి.అప్పలరాజు నేతృత్వంలో పోలీసులు పటిష్టఏర్పాట్లు చేశారు

అనంతుని దీపోత్సవంలో భాగంగా కుంతీమాధవస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో స్వామి ఉత్సవ విగ్రహాలను ఘాట్‌రోడ్డులో వెయ్యవ మెట్టు వద్ద ప్రతిష్టించారు. కొండ దిగువన కుంతీమాధవస్వామి ఆలయంలోనూ వేకువజామున 4గంటలకే సుప్రభాత సేవలతో మేల్కొలిపి, ఇతర పూజలు అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బారికేడ్ల ద్వారా ఆరుగంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కుంతీమాధవస్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీదేవి,భూదేవి సమేత అనంతపద్మనాభుని ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ప్రతిష్టించి, ప్రథమమెట్టు వరకు ఊరేగించారు. తప్పెటగుళ్లు, కోయడాన్సులు, పులివేషాలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమంలో వేలసంఖ్యలో భక్తులు పాల్గొనగా, తిరువీధి ఉత్సవం ఘనంగా సాగింది. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు ఆనవాయితీ ప్రకారం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు పేరిట గోత్రనామాలతో పూజలు చేసి, దీపోత్సవాన్ని ప్రారంభించగా, వేలదీపాలతో అనంతపద్మనాభుని కొండ దేదీప్యమానంగా అలరారింది. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

అనంతుని దీపోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విజయనగరం, తగరపువలస, విశాఖ వైపునుంచి వచ్చే వాహనాలకు వేర్వేరుగా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. విజయనగరం, తగరపువలస, నీలకుండీల నుంచి ఆర్‌టిసి ప్రత్యేక బస్ సర్వీసులను నడిపింది. మధ్యాహ్నం 3గంటల తర్వాత పద్మనాభంలోకి బస్సులు, వాహనాలు రాకుండా మళ్లించారు.

పటిష్ట పోలీసు భద్రత

దీపోత్సవానికి వేలల్లో భక్తులు తరలిరావడంతో ఎసిపి బి.అప్పలరాజు ఆధ్వర్యంలో 50మంది పోలీసు అధికారులు, వందమంది మహిళా పోలీసులతో సహ 450 మంది పోలీసులు భద్రత కల్పించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నాలుగు ఉచిత వైద్యశిబిరాలు, రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. రెండు అగ్నిమాపక వాహనాలు సిద్ధం చేశారు. భీమిలి ఆర్‌డిఒ ఆధ్వర్యంలో తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది భక్తులకు సహకరించారు.

విద్యుత్ ఛార్జీల పెంపు వద్దు : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి, అచ్యుతాపురం : రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు ఇఆర్‌సి ఆమోదం తెలిపిందని, 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.9,412 కోట్ల ఇంధన సర్దుబాటు ఛార్జీలను వసూలు చేయాలని ఆదేశించిందన్నారు. యూనిట్‌కు 92 పైసలు చొప్పున డిసెంబర్ 1 నుండి వసూలు చేయడం ద్వారారూ.7,912 కోట్ల భారం ప్రజలపై మోపనుందన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇలా ప్రజలను నమ్మించి మోసం చేయడం దారుణమన్నారు. పంటలకు మద్దతు ధర లేక, కూలీల దినసరి వేతనం పెరగక, నిత్యావసరాల ధరలతో సతమతమౌతున్న ప్రజలపై విద్యుత్ ఛార్జీలభారం మోపడం దుర్మార్గమన్నారు. . మరో వైపు స్మార్ట్ మీటర్లు బిగింపును ప్రభుత్వం వేగవంతం చేసిందని, రానున్న రోజుల్లో విద్యుత్‌కు కూడా రీఛార్జి చేసుకోవాల్సిన దుస్థితి రానుందన్నారు.విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వెంకన్న, రాము హెచ్చరించారు.

కొట్లాట కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పెద ఉప్పాడలో గురువారం జరిగిన ఓ కొట్లాట కేసులో ముగ్గురు వ్యక్తులను స్థానిక పోలీసులు శని వారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం..

పెద ఉప్పాడ గ్రామానికి చెందిన పిరిడి రాము, కారి రాము ఇరువురి మధ్య ఉన్న పాత కక్షల నేపథ్యంలో గురువారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో ఇరువురి మధ్య గొడవ జరిగి, చివరకు కొట్లాటకు దారి తీసింది. కర్రలు, బీరు బాటి ళ్ళతో కొట్టుకున్నారు. ఈ కొట్లాటలో బమ్మిడి అజయ్, చిల్ల అప్పలరాజు కూడా పాల్గొన్నారు. బాధితుడు పిరిడి రాము ఫిర్యాదు మేరకు కారి రాము, అజయ్, అప్పలరాజులను అరెస్ట్ చేశారు. మహిళా ఎస్ఐ ఎన్ గౌరి కేసు దర్యాప్తు చేస్తున్నారు

స్వీట్ షాప్‌లపై ఫుడ్ సేఫ్టీ దాడులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎంవిపి.కాలనీ టిటిడి కళ్యాణ మండపం వద్దనున్న తాపేశ్వరం వారి లక్ష్మీ గణపతి స్వీట్స్ షాప్, శ్రీ శివరామ స్వీట్స్, స్వీట్ ఇండియా తదితర షాపులపై ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. పలు ఆహార పదార్థాలను, వాటి తయారీకి వినియోగించే వస్తువులను సీజ్ చేసినట్లు ప్రాంతీయ నిఘా అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కొల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి ఎన్.మురళీకృష్ణ, ఫుడ్ సేఫ్టీ అధికారి జివి.అప్పారావు నేతృత్వంలో ఆయా స్వీట్ షాపులపై దాడులు చేసి నెయ్యి శ్యాంపిల్స్ సేకరించి, విశ్లేషణకు పంపించినట్లు తెలిపారు. ఆయా షాపులపై ఫుడ్ సేఫ్టీ యాక్ట్ 2006 ప్రకారం కేసులు నమోదు చేసి నోటీసులు జారీ చేశామన్నారు.

ప్రజా శ్రేయస్సే సహకార బ్యాంకుల లక్ష్యం

- మానం ఆంజనేయులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగ బ్యాంకులు కార్పొరేట్ రంగానికి, పెద్ద వ్యాపారులకే రుణాలు ఇస్తున్న నేపథ్యంలో సహకార బ్యాంకులు సామాన్య ప్రజలకు రుణాలు అందించాలని విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు సూచించారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యాన పోర్టు కళావాణి ఆడిటోరియంలో శనివారం మానం ఆంజనేయులుకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహకార బ్యాంకులు ప్రజాస్వామ్య యుతంగా, జవాబుదారీతనంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. సహకార బ్యాంకులను పాలకవర్గాలు, ఉద్యోగులు, సభ్యులే కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వాలు సహకారం అందించని పరిస్థితుల్లో ప్రజలు తమకు తాము పరస్పరం సహకరించు కునేందుకు ఏర్పాటు చేసుకున్నవే సహకార సంస్థలని అన్నారు. మధ్యతరగతి ప్రజల ఆదాయాలు తగ్గి వారు ఆర్థికంగా మరింత క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో బ్యాంకుల్లో సేవింగ్స్ తగ్గుతున్నాయని తెలిపారు. అనంతరం ఆయనను సహకార రంగ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, కార్మిక,కర్షక సంఘాల ప్రతినిధులు, విసిబి ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

సభకు అధ్యక్షత వహించిన విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ సహకార రంగంలో మానం ఆంజనేయులు చేసిన కృషిని కొనియాడారు. బ్యాంకు చైర్మన్‌గా అకుంఠిత దీక్షతో పనిచేసి బ్యాంకు అంచెలంచెలుగా ఎదగడంలో ఆయన చొరవ విశిష్టమైనదన్నారు. నేడు 54 బ్రాంచ్ లతో రూ.7675 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించే స్థాయికి ఎదగడంలో మానం ఆంజనేయులు పాత్ర కీలకమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ సమాజ హితం కోసం పనిచేసే మానం ఆంజనేయులు లాంటి వారు ఎక్కువకాలం సేవలందించడం ద్వారా కార్మిక, కర్షక వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వ్యవస్థాపక చైర్మన్ ఎంఆర్‌కె రాజు, కనకమహాలక్ష్మి బ్యాంకు డైరెక్టర్, పారిశ్రామికవేత్త ఆర్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -తగరపువలస : హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహనకు సంగివలస ఎన్ఆర్ఐ వైద్య కళాశాల వైద్యులు, వైద్య, పారా మెడికల్ విద్యార్థులు, సిబ్బంది శుక్రవారం సంగివలసలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అనంతరం రెడ్ రిబ్బన్ ఆకారంలో నిల్చుని నినాదాలు చేశారు..కార్యక్రమంలో అనిల్ నీరుకొండ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమా దేవి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ శరత్‌బాబు, ప్రొఫెసర్ కెవి చక్రధర్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చెంచు రెడ్డి పాల్గొన్నారు

ములగాడ : ప్రజల్లో చైతన్యమే ఎయిడ్స్ నివారణకు మార్గమని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా బిబిఎ, బిసిఎ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలను ప్రారంభించారు. హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహనకు సూచనలు, జాగ్రత్తలు వివరించారు. క్విజ్ పోటీ నిర్వహణలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయ దేవి, వి. అంజలీదేవి, నదియా, సంధ్యారాణి సహకరించారు.

హనీ ట్రాప్ కేసులో ప్రధాన ముఠా సభ్యుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలో సంచలనం సృష్టించిన జాయ్ జమీమా హనీ ట్రాప్ కేసులో ప్రధాన ముఠా సభ్యుడు వేణుభాస్కర్‌రెడ్డిని ఎయిర్‌పోర్టు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. కొంత కాలంగా నిందితుడు దేశంలో వివిధ ప్రాంతాల్లో దాక్కొని తప్పించుకు తిరుగుతుండటంతో పోలీసులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి చాకచక్యంగా వేణు భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. వేణు భాస్కర రెడ్డి జమీమాతో సహజీవనం చేసి, ఆమె చేసిన నేరాల్లో ప్రధాన సభ్యుడుగా ఉంటూ దాడులు, హత్యా ప్రయత్నాలలో భాగమయ్యాడు. వివాహమైన పురుషులను మత్తులోనికి దించే ప్రక్రియలో కీలక పాత్ర పోషించాడని, బెదిరింపుల ద్వారా భారీగా నగదు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నగరంలో మరి కొన్ని ప్రాంతాల్లో నమోదైన కేసుల్లో ఇంకా దర్యాప్తు జరుగుతుందని అధికారులు తెలిపారు. జాయ్ జమీమా విశాఖపట్నంలో ధనికులు, వివాహమైన పురుషులను లక్ష్యంగా చేసుకుని వారితో మోసపూరిత ప్రేమాయణం, సహజీవనం, నిశ్చితార్థాలు చేసుకుని వారిని బెదిరించి రూ.లక్షలు వసూలు చేసి చివరకి వారిపై దాడులు, హత్యా ప్రయత్నాలు చేయించి అరెస్ట్ అయి జైలులో ఉన్న విషయం విదితమే.

నేరాలు ఘోరాలు

దాడికి పాల్పడిన నలుగురు అరెస్టు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తీసుకొన్న అప్పు రూ 2 వేలు ఇవ్వనందుకు ఓ వ్యక్తిపై కర్రలతో దాడి చేసి, తీవ్రంగా గాయపర్చిన కేసులో నలుగురిని శనివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. చిన నాగమయ్య పాలెం గ్రామానికి చెందిన బొడ్డు నరసింగరావు, అదే గ్రామానికి చెందిన బి నరసింగరావు వద్ద రూ 2 వేలు అప్పుగా తీసుకున్నాడు. తన అప్పు తీర్చాలని గురువారం రాత్రి నరసింగరావు, అతని అనుచరులు బొడ్డు అప్పలరాజు, ధనరాజు, అప్పారావుతో కలిసి బొడ్డు నరసింగరావు ఇంటికి వెళ్ళి గొడవ చేశారు. అంతటితో ఆగకుండా కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు బొడ్డు నరసింగరావు ఫిర్యాదు మేరకు, దాడికి పాల్పడ్డ నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ బి సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- గాజువాక: చోరీలకు పాల్పడుతున్న యువకుడిని న్యూ పోర్ట్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి క్రైం ఎడిసిపి మోహనరావు తెలిపిన వివరాలివి. బిసి రోడ్డుకు చెందిన కోటారావు వికాస్‌నగర్‌లో ఒంటరిగా నివాసముంటున్న చిట్టి రమాబాయి ఇంట్లోకి వెనుక నుండి వచ్చి ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును దొంగతనం చేశారు.. దీనిపై బాధితురాలు న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం సిసి ఫుటేజీ ఆధారంగా నిందితుడి కదలికను గమనించి, నిందితుడు కోటారావును అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.64వేల నగదు, ఓలా స్కూటర్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్రైం సిఐ జి.శ్రీనివాస రావు, న్యూపోర్ట్ ఎస్ఐ అప్పలరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : చోరీ కేసులో నిందితుడిని ఆరిలోవ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఎంవిపి క్రైం పోలీస్‌స్టేషన్లో మీడియాకు అదనపు డిసిపి (క్రైమ్) ఎ.వెంకటరావు తెలిపిన వివరాలివి. నవంబర్ 22న ఇంటి ముందు పని చేసుకుంటున్న కుప్ప అప్పయమ్మ మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఆరిలోవ పోలీసులు విచారణ చేపట్టారు. ఆరిలోవ దుర్గాబజారుకు చెందిన కుప్ప వెంకట గౌతంను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతని నుంచి చోరీకి గురైన బంగారం పుస్తెలతాడు రికవరీ చేశారు. సమావేశంలో ద్వారక డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వి.చక్రధరరావు, ఆరిలోవ క్రైమ్ ఎస్ఐ ఎ.హరికృష్ణ పాల్గొన్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ/ విశాఖ కలెక్టరేట్ : అల్లూరి జిల్లా జి.మాడుగుల నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఈస్ట్ ఎసిపి లక్ష్మణమూర్తి తెలిపిన వివరాలివి. తమిళనాడుకు చెందిన షకీలా గుణ, పాలిని రాజేష్, నజీర్ భాష, జబునిషాలు జి.మాడుగుల మండలం దిగురుపల్లి గ్రామానికి చెందిన లాసంగి మల్లన్న ద్వారా 20 కిలోల గంజాయి కొనుగోలు చేసి చెన్నై తీసుకెళ్లేందుకు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. సమాచారం అందుకున్న నగర పోలీసులు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని, గంజాయి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు.

12 కిలోల గంజాయి పట్టివేత

ఎస్.రాయవరం: మండలంలోని అడ్డురోడ్డు జంక్షన్ వద్ద ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 12 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు స్థానిక ఎస్ఐ విభీషణరావు తెలిపారు. గంజాయి ప్యాకెట్లతోపాటు ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. నిందితుల్లో నలుగురు కడప జిల్లా నంద్యాలకు చెందిన వారు కాగా, గంజాయి సరఫరాదారు అల్లూరి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు.

వ్యక్తి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం గ్రామానికి చెందిన లంక హరీష్ ఆచూకీ లభ్యమైంది. రెండురోజుల క్రితం విశాఖ ఎంవిపి కాలనీకి వెళ్లొస్తానని చెప్పిన హరీష్ తిరిగి రాకపోవడంతో ఆయన మేనమామ శొంఠ్యాంకు చెందిన బొద్దపు అప్పారావు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ గాంధీ దర్యాప్తు చేపట్టి, మొబైల్ ట్రాకింగ్ ఆధారంగా చిన్నవాల్తేరులో ఉన్నట్లు ట్రేస్ చేసి పట్టుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు.

పెదగంట్యాడలో పోలీస్ గస్తీ పెంచాలి



మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : మండల పరిధిలోని కొన్ని సమస్యాత్మక ప్రాంతాలలో అల్లరి మూకలు, ఆకతాయిల ఆగడాలతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెదగంట్యాడలో పోలీస్ గస్తీని. పెంచి రక్షణ కల్పించాలని టిడిపి నేత పులి రమణారెడ్డి కోరారు. శనివారం రాష్ట్రహోంశాఖ మంత్రి వంగలపూడి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. పోలీసు గస్తీ పెంచడంతోపాటు అవసరమైన చోట సిసి కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలన్నారు. హోంశాఖ మంత్రిని కలిసిన వారిలో టిడిపి అర్బన్ జిల్లా నాయకుడు ములకలపిల్లి పెంటా రావు, ముషిడి శ్రీనివాస్, నీలాపు అప్పల రెడ్డి, కినాడ అప్పలరాజు అన్నారు.

జోరు వర్షంలోనూ కొనసాగిన దీక్షలు



దీక్షలలో పాల్గొన్న పోర్టు కార్మికులు

ప్రజాశక్తి- సీతమ్మధార : పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని ప్రయివేటుపరం చేయవద్దంటూ సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు చేపట్టిన దీక్షలు శనివారం 61వ రోజుకు చేరుకున్నాయి. బోరున కురుస్తున్న వర్షంలోనూ ఆందోళన కారులు పోర్టు యాజమాన్యానికి, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా దీక్షలను కొనసాగించారు. ఈసందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు ఉద్యోగులు, కార్మికులు కష్టార్జితంతో ఏర్పాటైన గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పిపిపి పద్ధతిలో ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దీనిపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 40వేల మంది పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబీలకు ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఈ సమస్యను నేతలు నిర్లక్ష్యం చేయడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో జక్కాన సత్యనారాయణ, సాంబమూర్తి, శంకరరావు పైడిరాజు, నాయుడు, కెఎస్ కుమార్, మురళి, బి జగన్ పాల్గొన్నారు

'ఉక్కు' సిజిఎమ్‌కు సత్కారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉద్యోగ విరమణ చేస్తున్న స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ (వర్క్స్) ఉప్పులూరి శ్రీధర్‌ను స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి పెంపునకు ఉద్యోగులు, కార్మికులు అంకితభావంతో పనిచేయాలని, ఉక్కు ఫ్యాక్టరీకి మంచి భవిష్యత్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు కార్యక్రమంలో ఎస్‌సి లైసెన్ ఆఫీసర్ నల్లి సుందరం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్యనారాయణ, ఎల్‌వి.రమణారావు, ఆర్‌విఎన్ సాయిప్రసాద్, వైఎస్‌ఆర్‌టియు వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి పుల్లారావు కార్యదర్శి ఎస్ మోహన బాబు, బిఎంకె రెడ్డి, కుసుమ శ్రీనివాస్ ఎంవి రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు సుందరనగర్ కొండవాలు ప్రాంతంలో జివిఎంసి నిధులు రూ 36 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శనివారంఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో సుందరనగర్, కొండవాలులో రోడ్లు, కాలువలు, యుజిడి పనులు చేపట్టనున్నారుఉ. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, ఇన్‌చార్జ్ మద్దిల రాజశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్, డి.నరేష్ కుమార్ పాల్గొన్నారు

పదో రోజుకు విశాఖ డెయిరీ కార్మికుల దీక్ష



దీక్షల్లో పాల్గొన్న విశాఖ డెయిరీ కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు చేపడుతున్న రిలేదీక్షలు శనివారం పదోరోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ మాట్లాడుతూ, యాజమాన్యం తక్షణమే స్పందించి, కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.కార్మికుల సమస్యలపై రీజనల్ లేబర్ కమిషనర్ చర్చలకు రావాలని పిలిస్తే యాజమాన్యం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. దీక్షల్లో యూనియన్ అధ్యక్షులు కెవి. వరహామూర్తి, చిన్నమ్మలు, అనసూయ, వి నారాయణ పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధం : ఆర్‌కెఎస్‌వి కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : డిమాండ్లు నెరవేర్చకుంటే విశాఖ డెయిరీ కోఆపరేటివ్ ఉద్యోగులు సమ్మెకు సిద్ధంగా ఉన్నారని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ తెలిపారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో విశాఖ డెయిరీ ఉద్యోగుల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ డెయిరీలో గత 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు అమలు కావడం లేదన్నారు. సమస్యలపై శనివారం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వద్ద జాయింట్ మీటింగ్ జరిగిందని, యాజమాన్యం చర్చలకు హాజరు కాలేదని తెలిపారు. డెయిరీ యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. తిరిగి డిసెంబర్ 4వ తేదీన జాయింట్ మీటింగ్ జెసిఎల్ ఏర్పాటుచేశారని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే తరువాత జరిగే చర్యలకు యాజమాన్యమే పూర్తి భాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. డిసెంబర్ 6వ తేదీ తరువాత ఏరోజు నుంచి అయినా కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్.రమణ, రాజేంద్రప్రసాద్, నారాయణ, బసవరాజు, అచ్చెన్నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల సద్వినియోగంపై అవగాహన

- విశాఖ వేలీ స్కూల్‌లో 'క్యాచ్ దెమ్ యంగ్ "ప్రాజెక్టు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : వ్యర్థాల నుంచి సంపద సృష్టిపై ప్రోత్సహిస్తున్న అంతర్జాతీయ సంస్థ ఐకాన్ ఫౌండేషన్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ సంయుక్త ఆధ్వర్యాన విశాఖ వేలీ పాఠశాలలో 'క్యాచ్ దెమ్ యంగ్, జీరో వేస్ట్ అండ్ సర్క్యులర్ ఎకానమి ఇన్ క్యాంపస్' ప్రాజెక్టును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ సాధనకుమార్ ఘోష్ మాట్లాడుతూ దేశంలో 152 పాఠశాలలలో రెండు లక్షల మంది విద్యార్థులు ఈ ప్రాజెక్టులో ఇప్పటి వరకు భాగస్వామ్యులయ్యారన్నారు. విశాఖ వేలీ స్కూల్‌లో ఈ ప్రాజెక్టు ద్వారా నగరంలోని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, పాఠశాల ఆవరణలో మూడు రకాల డస్ట్‌బిన్‌ల ఏర్పాటు ద్వారా వ్యర్థాల సేకరణ, వాటితో ఉపయుక్తమైన వస్తువుల తయారీపై అవగాహన కల్పిస్తామన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

ఈశాన్య రాష్ట్రాలలో ఈ ప్రాజెక్టు విజయవంతమైందన్నారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

2న విశాఖ డెయిరీ ముట్టడిని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సిఐటియు నేత మూర్తి

ప్రజాశక్తి -తగరపువలస : తగ్గించిన ఆవుపాల సేకరణధర పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 2న సోమవారం విశాఖ డెయిరీ ముట్టడిని జయప్రదం చేయాలని సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో యూనియన్ ు నాయకులు ఎస్ అప్పలనాయుడు, పి సూర్య నారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆవు పాల సేకరణ ధరను లీటరుకు రూ.3 తగ్గించడంతో డెయిరీ పరిధిలోని పాడిరైతులు రోజుకు రూ.20లక్షలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల పాడిరైతులు పెద్దఎత్తున పాల్గొని ముట్టడి ఆందోళన విజయవంతం చేయాలన్నారు.

ఎఎంసిలో పోస్టుల భర్తీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర వైద్య కళాశాలలో 29 కాంట్రాక్టు, 71 అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మీడియాకు తెలిపారు. వీటిలో 10 కాంట్రాక్ట్ పోస్టుల మెరిట్ జాబితా, 71 అవుట్ సోర్సింగ్ పోస్టులకు ప్రొఫెషనల్ మెరిట్ లిస్ట్ జాబితా ఆంధ్ర వైద్యకళాశాల అధికారిక వెబ్సైట్ www.amc.edu.in నందు విశాఖపట్నం NIC website www.visakhapatnam.ap.gov.in recruitmentamcgreivances@gmail.com నందు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వీటిపై అభ్యంతరాల స్వీకరణకు 10 రోజులు గడువు ఇచ్చినట్లు తెలిపారు.

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ బదిలీ

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్ కుమార్‌ను అనంతపురం జైలుకు బదిలీ చేస్తూ రాష్ట్ర జైళ్ళ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో నెల్లూరు కేంద్రకారాగారంలో అదనపు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.మహేష్‌బాబు రానున్నారు. విశాఖ కేంద్ర కారాగారం అదనపు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును నెల్లూరు జైలుకు బదిలీ చేశారు. తదుపరి ఉత్వర్వులు అందేవరకు ఎం.మహేష్ బాబును సూపరింటెండెంట్‌తో పాటు అదనపు సూపరింటెండెంట్ బాధ్యతలు నిర్వహించాలని ఉత్వర్లుల్లో పేర్కొన్నారు.

ప్రణాళికాయుతంగా అభివృద్ధి పనులు

- ప్రజలకు ఇబ్బంది లేకుండా డంపింగ్ యార్డు అభివృద్ధి
- జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశం
- ఎమ్మెల్యే పల్లాతో కలిసి జోన్‌లో విస్తృత పర్యటన

ప్రజాశక్తి- గాజువాక: జివిఎంసి గాజువాక జోన్ పరిధిలోని వార్డుల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు చేయాలని జివిఎంసి ప్రధాన కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రామచంద్రనగర్ డంపింగ్‌యార్డును అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు శనివారం గాజువాక జోన్ పరిధిలో పలు ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి విస్తృతం పర్యటించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని పలు సమస్యలను కమిషనర్ దృష్టికి ఎమ్మెల్యే పల్లా తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

జనావాసాల మధ్యనున్న రామచంద్రనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వ్యర్థాలు ఎక్కువగా వస్తున్నందున వాటి నుంచి దుర్వాసన రాకుండా కొంతవరకు రేకులతో కవర్ చేయడంతోపాటు రక్షణగోడ ఎత్తు పెంపుతోపాటు, మరొక క్లోజ్డ్ కాంపాక్ట్ సిస్టం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్ రాజును ఆదేశించారు. ఆదర్శనగర్ కనెక్టివిటీ రోడ్డు అభివృద్ధి, బిసి రోడ్డు విస్తరణ, వుడా కాలనీ నెల్లిముక్క ప్రాంతంలోని ఖాళీ స్థలంలో క్రీడలకు కోర్టుల ఏర్పాటుకు ప్రణాళికాయుతంగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఆదర్శ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం పనులను వెంటనే ప్రారంభించాలన్న ఎమ్మెల్యే పల్లా సూచనలపై కమిషనర్ స్పందించారు. 87వ వార్డు కళింగవీధిలో నాలుగు ఎకరాల ఖాళీ స్థలాన్ని వెంటనే ఆధీనంలోనికి తీసుకొని, ఎమ్మెల్యే పల్లా సూచించిన విధంగా ప్రజోపయోగానికి వీలుగా అభివృద్ధికి ప్రతిపాదనలు చేయాలని సిటీ ప్లానర్ మీనా కుమారి, ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్ రాజు, జోనల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రిలను కమిషనర్ ఆదేశించారు. మందల కాలనీ గెడ్డ ఆధునికీకరణ, ఇరువైపులా ఫెన్సింగ్, విద్యుత్ దీపాలను ఏర్పాటుపై సూచనలు చేశారు. అనంతరం



గాజువాక జోన్‌లో ఎమ్మెల్యే పల్లాతో కలిసి పర్యటిస్తున్న జివిఎంసి కమిషనర్

కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలించి, విస్తరణకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, బొండా జగన్నాథం, పర్యవేక్షక ఇంజనీర్ గోవిందరావు, డిడిహెచ్ ఎం.దామోదరరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు చిరంజీవి, అప్పారావు, కనకారావు, ఎసిపి వెంకట్రావు, సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ గాసి బాబు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు వర్ధంతి



పరవాడలో మాట్లాడుతున్న ఐద్వా నేత మాణిక్యం

ప్రజాశక్తి-పరవాడ

అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ వెంకట అప్పారావు 109 వర్ధంతి కార్యక్రమం ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆధ్వర్యంలో శనివారం పరవాడ బాలికల పాఠశాలలో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ వరకట్న వేధింపులు, బాల్యవివాహాలు అరికట్టాలని, స్త్రీలు వంటింటికే పరిమితం కాకుండా బాగా చదువుకొని సమాజ మార్పుకు తోడ్పడాలని గురజాడ అప్పారావు ఎన్నో రచనలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి, పిఇటి టీచర్ తులసి, ఉపాధ్యాయులు సుమలత, ప్రశాంతి, సత్యం, పుష్పవల్లి, ఉమాదేవి, విజయలక్ష్మి, సాయి, చిట్టి, రత్నం, విజయలక్ష్మి విద్యార్థినులు పాల్గొన్నారు.

కశింకోట : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కశింకోటలో గురజాడ చిత్ర పటానికి ఐద్వా నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు టి.తనూజ, ఆళ్ళ మహేశ్వరి, శ్యామల, పలువురు మహిళలు పాల్గొన్నారు.



యలమంచిలిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

యలమంచిలి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, శాఖా గ్రంథాలయాల్లో గురజాడ 109వ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజీ, ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం, గురజాడ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు సుధ, రేవతి, లైబ్రేరియన్ ఆనంద్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, సతీశ్, రాము, లక్ష్మణ్, ధర్మ, సిఐటియు నాయకులు రామకృష్ణ, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల, కెట్స్ కళాశాలల్లో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కన్వీనర్ ఆర్ లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యురాలు మంగతాయారు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు, సాయి శంకర్, రామ్ నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురజాడ వెంకట అప్పారావు చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చోడిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.ఫాల్గుణరావు, చిన్నారావు, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మహాకవి గురజాడ అప్పారావు జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని గురజాడ ఫౌండేషన్ సభ్యులు, వైస్ ఎంపిపి బొలిశెట్టి గోవిందరావు కొనియాడారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జన్మస్థలమైన యస్ రాయవరంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడపై కోలాటం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సత్యనారాయణ, యస్ఐ విభీషణరావు, టిడిపి మండలశాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ ఎంపిటిసి కొణతాల శ్రీనువాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : గురజాడ అడుగుజాడల్లో అందరూ నడవాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి పిలుపునిచ్చారు. మహాకవి గురజాడ అప్పారావు చిత్రపటానికి జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఐద్వా సీనియర్ నాయకులు జి.మణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.మణి, ఆర్.వరలక్ష్మి, బి.భారతి, కె.కుమారి, ఆర్.విమల, బి.మమత, ఎం.నిర్మల, కె.సంతోషం, కె.సత్యవతి,



ఎస్.రాయవరంలో గురజాడ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆర్.పార్వతి, ఆర్.ముత్యాలమ్మ, పి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

కరాస : జివిఎంసి 52వ వార్డు ప్రాథమిక పాఠశాలలో మహాకవి గురజాడ అప్పారావు చిత్రపటానికి ఐద్వా జిల్లా కార్యదర్శి బి.పద్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశమును ప్రేమించుమన్నా గేయాన్ని పిల్లలకు చక్కగా వివరిస్తూ గురజాడ గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులంతా గురజాడ అడుగుజాడల్లో నడవాలని, కులమత బేధం లేకుండా విద్యావంతులై, భావితరాలకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భారతీదేవి, ఐద్వా నాయకులు సుమిత్ర, ఎం జయలక్ష్మి, రమణమ్మ, కె.హేమలత, సుధ, జ్యోతి, ఉమా శేషగిరిరావు, నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

మాధవధార : కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలు జ్యోతి రాజుల ఆధ్వర్యంలో జరిగిన గురజాడ అప్పారావు వర్ధంతిలో ఆయన చిత్రపటానికికళాశాల ప్రిన్సిపల్ కెవి రమణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అమృత, సాగర్ కుమార్, ఆర్ రాము, సిహెచ్ తన్వీర్, పి దుర్గాప్రసాద్, సిహెచ్ సుమిత్ర, భానుమూర్తి, కె.ప్రభాకర్ పాల్గొన్నారు



విశాఖ కరాసలో మాట్లాడుతున్న ఐద్వా నేత పద్మ

డిజైన్ థింకింగ్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి

'డిజైన్ థింకింగ్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, కెపాసిటీ బిల్డింగ్' అన్న అంశంపై డైట్ కళాశాలలో అధ్యాపకులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలిసి నవంబర్ 26 నుండి 30 వరకు జరిగిన ఈ సదస్సులో శనివారం ముఖ్యఅతిథిగా ఐపీఎఫ్ఫీ అండ్ టిఐఎస్సి శాస్త్రవేత్త డాక్టర్ భవ్య మంజీర పాల్గొని ప్రసంగించారు. అకాడమిక్ పరిశోధనలు, ఆవిష్కరణలను సరైన రీతిలో రక్షించుకోవడం, వాటి వాణిజ్య సమాధానాలను, కాపీ హక్కులను పర్యవేక్షించడం, ఐపిఆర్ సరైన విధంగా నిర్వహించడం వల్ల పరిశోధనలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, సియస్‌సి విభాగాధిపతి డాక్టర్ కె.సుజాత, అధ్యాపకులు ఎ.కృష్ణ నాగ్, పి.పూర్ణ ప్రియా, జి. గంగాధర్ గుప్త, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్తా

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య పొందుతున్న విద్యార్థుల సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్తామని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ద్వారా ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య పొందుతున్న విద్యార్థుల తల్లితండ్రులు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రలకు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ ద్వారా విద్యార్థుల సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్, పార్టీ నాయకులు పోలారపు త్రినాథ్, దాడి జగన్, మాజీ ఎంపీటీసీ శెట్టి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అవినీతి వల్ల విద్యుత్ వినియోగదారులపై భారాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అవినీతి అక్రమాల వల్ల విద్యుత్ వినియోగదారులపై లక్ష పదివేల కోట్లు భారం పడిందని టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కెకెవి.నారాయణరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలుతో సంపద సృష్టించానని, దాని వల్ల ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. సంపద పెంచడం వల్ల రాజకీయ పార్టీలు తనకు సాలువాతో సన్మానం చేయాలని కోరుకోవడం చూస్తుంటే ఆయన మానసిక పరిస్థితిపై అనుమానాలు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు, అనకాపల్లి పార్లమెంట్ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆలయంలో భక్తులకు సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించేందుకు ఆలయ కమిటీ కృషి చేయాలని రాష్ట్ర మున్సిపల్ అర్బన్ మౌలిక సదుపాయాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ సూచించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పీలాను టిడిపి కార్యాలయంలో శనివారం శ్రీభోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, ధర్మకర్తలు కలుసుకొని శాలువాతో సత్కరించారు. భోగలింగేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా పీలా గోవింద మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు పెంటకోట గణేష్, మళ్ళ సూరిబాబు, మద్దాల నారాయణరావు, బుద్ద సంతోష్ కుమార్, పార్టీ నాయకులు ఉగ్గిని రమణమూర్తి, బొలిశెట్టి శ్రీనివాసరావు, గొంతిన శ్రీనివాసరావు, వేగి గోపికృష్ణ, జెర్రిపోతుల నూక నాయుడు, సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పీలాకు భోగలింగేశ్వర స్వామి చిత్ర పటం ఇస్తున్న సత్యనారాయణ

15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి

ప్రజాశక్తి-కశింకోట, అనకాపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో కేంద్ర ప్రభుత్వం నుండి రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి తెలిపారు. అనకాపల్లిలో శనివారం జరిగిన టిడిపి మండల నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ కశింకోట మండలంలోని 27 గ్రామ పంచాయితీలకు బేసిక్ రూ..56,85,383, టైడ్ రూ.85,28,075, మొత్తం రూ.1,42,13,458 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో గ్రామాలలో పారిశుధ్య కార్మికులకు జీతాలు, వీధి దీపాలు, పారిశుధ్య పనులు చేపడుతున్నటల చెప్పారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీలు షేక్ దర్గా, బుద్ధిరెడ్డి నాయుడు, సర్పంచ్ బలిజ మంగ ముసలినాయుడు, నైనంశెట్టి రమణరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలలో ఎడవ రోజు శనివారం కశింకోట టిడిపి నాయకుల ప్రోత్సాహంతో సత్యసాయి ఆశ్రమ వృద్ధులకు శనివారం రగ్గులు పంపిణీ చేశారు. వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతన శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, వేగి గోపికృష్ణ, పెంటకోట సుబ్బలక్ష్మి, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్, నైనంశెట్టి రమణారావు, ఎంపిటీసీలు షేక్ దర్గా, బుదిరెడ్డి అప్పడు, తాకాసి కృష్ణ, నారిపల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్ సిద్దిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొణతాల



పింఛను పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో శనివారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, పీలా తాతునాయుడు, పీలా విశ్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ క్రరి బాబి, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నేత నరేష్ పింఛన్లు పంపిణీ

బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాదిలో టిడిపి టౌన్ అధ్యక్షులు దొండ నరేష్ శనివారం ఉదయం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వర్షంలోనూ సచివాలయం సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.



పింఛను అందిస్తున్న టిడిపి నేత నరేష్

క్రీడాకారుడు లాస్యంత్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లికి చెందిన యువ స్కేటర్ వీరమాచినేని శ్రీసూర్య లాస్యంత్ జాతీయ స్కేటింగ్ పోటీల్లో 6-7 కేజీల విభాగంలో పాల్గొనేందుకు ఎంపికైన సందర్భంగా శనివారం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ క్రీడలలో యువతను ప్రోత్సహించాలని ఉద్దేశంతో లాస్యంత్‌కు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్కేటింగ్ పోటీలలో పాల్గొనేందుకు ఖర్చుల నిమిత్తం రూ.25వేలు అందించినట్లు చెప్పారు. స్కేటింగ్ ప్రపంచంలో అత్యుత్తమ స్థాయికి ఎదిగేలా నిరంతరం ప్రయత్నించాలని రాంకీ ఆకాంక్షించారు.

విశాఖ డెయిరీ ముట్టడిని జయప్రదం చేయండి

పలు గ్రామాల్లో రైతు సంఘం, సిఐటియు నేతల ప్రచారం

ప్రజాశక్తి- కె.కోటపాడు
విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలు ధర తగ్గించడాన్ని నిరసిస్తూ డిసెంబర్ 2న జరుగు డెయిరీ ముట్టడిని జయప్రదం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, పాల రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెనగంటి నాయుడు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్రా దేముడు పిలుపునిచ్చారు. విశాఖ డెయిరీ ముట్టడికి



రైతులతో మాట్లాడుతున్న రైతు నేత ముత్యాలనాయుడు

తరలిరావాలని కోరుతూ మండలంలోని గవరపాలెం, కొరువాడ, చౌడువాడ, గుల్లేపల్లి గ్రామాల్లో వారు పాడి రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తగ్గించిన పాల ధరను వెంటనే పెంచాలని, ఆవు పాలకు లీటరుకు రూ.50, గేదె పాలుకు రూ.80 కనీస ధర నిర్ణయించి చెల్లించాలని కోరారు. విశాఖ డెయిరీని 1964 సహకార చట్టం పరిధిలోకి తీసుకురావాలని, పక్క రాష్ట్రాలు మాదిరిగా పాడి రైతులకు ప్రోత్సాహం కింద రూ.5 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పాడి రైతులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని బయ్యవరంలో పాల రైతులతో శనివారం జరిగిన సమావేశంలో పాల రైతుల సంఘం కసింకోట నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ డెయిరీ ఉత్పత్తులు, రైతులకు అందించే దాణా ధరలు పెరుగుతుంటే రైతులకు ఇచ్చే పాల ధర తగ్గించడం అన్యాయమన్నారు. విశాఖ డెయిరీ యాజమాన్యం అవినీతిపై విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.రాంబాబు, జి.దుర్గి నాయుడు, కె.సూరిబాబు, పి. సాయి నాయుడు, సిహెచ్. లక్ష్మి, జి.లావణ్య, సిహెచ్.రాజమ్మ, ఎల్.లోవరాజు, సిహెచ్.సత్తిబాబు, ఎల్.చిన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాకారపు శ్రీనివాసరావు

యలమంచిలి : విశాఖ డెయిరీకి ఆవుపాలు సేకరణ ధర తగ్గించడంపై ఎపి రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని కొక్కిరాపల్లిలో శనివారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.శివాజీ మాట్లాడుతూ డిసెంబరు 2న జరిగే ఛలో విశాఖ డెయిరీని విజయవంతం చేయాలని కోరారు. సుగర్‌ఫ్యాక్టరీ మాజీ డైరెక్టరు గొర్లె నరసింహమూర్తి మాట్లాడుతూ అన్ని ధరలు పెరుగుతున్న తరుణంలో పాల ధరను తగ్గించడం దారుణమన్నారు. కార్యక్రమంలో కొక్కిరాపల్లి పాలరైతులు పాల్గొన్నారు.



టీచర్ జగదాంబను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ఉపాధ్యాయులు జగదాంబకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి
అంకితభావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఉపాధ్యాయురాలు దాడి జగదాంబను స్ఫూర్తిగా తీసుకోవాలని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన దాడి జగదాంబను శనివారం తుమ్మపాల వేణుగోపాలస్వామి కళ్యాణ మండపంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు చదరం నాగేశ్వరరావు, జనసేన నాయకులు గొల్ల బాబు, స్కూల్ కమిటీ చైర్మన్ పెతకం శెట్టి బలరాం, పీలా తాతు నాయుడు, హెచ్ఎం శంకర్రావు, వార్డు మెంబర్ మార్పూరు దామోదర్ పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయురాలు దాడి జగదాంబని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ సత్కరించారు. ఇటీవల రైల్వే స్టేషన్ సూపరిడెంట్‌గా పదోన్నతి పొందిన ఆడారి గోవిందరావు మాస్టారుకు పీలా శుభాకాంక్షలు తెలియజేసారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం సాగర్ సిమెంట్ కార్మికులకు రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్‌ధారణపై శనివారం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ అల్లు స్వామి నాయుడు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. మనం క్షేమంగా ఇంటికి వెళ్లాలంటే బైకు నడిపేటప్పుడు తప్పనసరిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిమెంట్ కంపెనీ ప్రతినిధులు శ్రీనివాసరావు, పాండు రంగారావు, కార్మికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ గ్రామంలో శనివారం అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, సాంఘిక సంక్షేమ అధికారులు పి.గంగునాయుడు, దాసరి రమేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాములమ్మ, సర్పంచ్ చల్లా లక్ష్మీ నాయుడు, చల్లా నానాజీ, దుక్క ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసిలో ఈ-సేవ పుస్తకం ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : ఎన్టిపిసి సింహాద్రిలో సిఐఎస్ఎఫ్ ద్వారా శనివారం ఈ-సేవా పుస్తకం ప్రారంభించారు. నేషనల్ డిజిటల్ ఇండియా చొరవలో భాగంగా సిఐఎస్ఎఫ్ దాని ఈ-సేవ బుక్ పోర్టల్‌ను ప్రారంభించినట్లు ప్రకటించారు. ఇది ఫోర్స్ సభ్యులందరికీ అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. పదవీ విరమణ చేసిన సిబ్బందికి రిటైర్మెంట్ తేదీలోనే అన్ని పెన్షనరీ ప్రయోజనాలను పొందేలా చూడడానికి పెన్షన్ ప్రాసెసింగ్ వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి దీనిని రూపొందించినట్లు చెప్పారు.

తాగునీటి సమస్య తీర్చండి

ప్రజాశక్తి-అనకాపల్లి
మండలంలో ఊడేరు గ్రామం అల్లిఖానుడి పాలెం కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు అధికారులకు విన్నవించారు. గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, సర్పంచ్ ఎస్ కృష్ణమోహన్, ఆర్ఐ జి రమేష్, ఎంపీడీవో కార్యాలయ అధికారి ఎడిఎం శ్రీనివాసరావు, ఎస్సై జె నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు, తోటాడ సింహాచలం, వార్డ్ మెంబర్ ఓ రాజు, హెచ్‌డబ్ల్యుఓ రామయ్య, వీఆర్వో రమేష్ ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి సమస్య ఉందని, కనీసం మంచినీటి బోరైనా ఏర్పాటు చేసి తమ సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం మధుబాబు మాట్లాడుతూ పౌరహక్కులపై అవగాహన కల్పించారు.

క్రికెట్ స్టేడియం ఏర్పాటుచేస్తాం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మండలంలోని ఎ.కొత్తపల్లి పంచాయతీ శివారు సంజీవపురంలో మాజీ సర్పంచ్ పెద్దాడ వెంకటరమణ ఆధ్వర్యంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలతో ఆ పార్టీ మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో స్టేడియం లేక విద్యార్థులు, యువత ఇబ్బంది పడుతున్నారని, త్వరలోనే స్టేడియం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, మాజీ జెడ్పిటిసి పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, టిడిపి నాయకులు చల్ల నానాజీ, కోమార బాబురావు, సిహెచ్.సూర్యనారాయణ, జనసేన నాయకులు రాముమూర్తి నాయుడు, కడిమి నాగేశ్వరరావు,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేయాలని వినతి

మండలంలోని నాగయ్యపేట రాజుల వీధిలో రోడ్డు మంజూరైనా నిర్మాణం చేపట్ట లేదని, వెంటనే రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తికి ఆ వీధి వాసులు శనివారం వినతి పత్రం ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బత్తి రమేషు, జామి నాయుడు, రాజులమ్మ, నౌడు దేవి, ఉమా, సత్యవమ్మ, కృష్ణవేణి, లక్ష్మి ఉన్నారు.

ఖర్చుల వివరాలు సభ్యులకు తెలియజేయాలి

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో డిమాండ్

ప్రజాశక్తి-యలమంచిలి
ప్రతి మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో అనేక రకాల ఖర్చులు గురించి ప్రతిపాదనలు చేసి ఆమోదిస్తున్నారని, అయితే వాటి ఖర్చులు ఏ విధంగా జరుగుతున్నాయో సభ్యులకు తెలియడం లేదంటూ వైస్ చైర్‌పర్సన్ ఆరెపు గుప్తా అన్నారు. దీనికి స్పందించిన చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ఎప్పుడో ప్రతిపాదించిన డిపార్టుమెంట్ పరంగా నియమించబడ్డ కౌన్సిల్ సభ్యుల కమిటీ సమావేశాలు ఎందుకు నిర్వహించలేదని అధికార్లను నిలదీశారు. ఇకపై కమిటీ సభ్యుల సమావేశాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ వ్యయ ప్రయాలకోర్చి రోడ్డు పక్క చెట్లు పెంపకం జరుగుతోందని, వాటిని విచక్షణ రహితంగా ఎలక్ట్రికల్ డిపార్టుమెంటు, పంచాయతీరోడ్డు విస్తరణ, కాలువలు నిర్మించే సమయంలోనూ నరికేస్తున్నారని సభ్యులు పేర్కొన్నారు. అడ్డగోలుగా ఒక చెట్టు నరికితే వారు కనీసం 100 చెట్లు పెంచాలని, లేనిచో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. 13 వార్డు నాగేంద్రకోలనీలో సుమారు 200 వీధిదీపాలు వెలగడం లేదని ఆ వార్డు సభ్యుడు మొరపెట్టారు. ఈ సమస్య వారం రోజుల్లో పరిష్కరిస్తామని కమిషనర్ ప్రసాదరాజు హామీ ఇచ్చారు. పట్టణాన్ని పట్టి పీడిస్తున్న కోతుల పట్టివేత కార్యక్రమం వారం పది రోజుల్లో ప్రారంభిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా సింహచలం, డిఇఇ, ఏఇ సుబ్బారావు, ఎంఇఒ మీనాక్షి, ఎలక్ట్రికల్ ఏఇ కనకరాజు, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

79వ వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కమిషనర్ సంపత్‌కు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ సమక్షంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శనివారం కలిసి తమ వార్డులో ముఖ్య సమస్యలపై విన్నవించారు. గల్లవానిపాలెం చెరువును అభివృద్ధి చేయాలని, మిగిలిపోయిన రోడ్లు, డ్రైన్లు పూర్తి చేయాలని, కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, జనరల్ హాస్పిటల్ రోడ్డు, కేఎస్ఎన్ రెడ్డి నగర్ రోడ్డు కాలువ నుంచి కాలువ వరకు తారు రోడ్డు నిర్మించాలని కోరారు.

ఠాగూర్ ఫార్మా క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న గనిశెట్టి

ప్రజాశక్తి-పరవాడ
పరవాడ ఫార్మాసిటీ ఠాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విశాఖ షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సౌకర్యాలను, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ మృతులకు కోటి రూపాయలు చెల్లించాల్సి ఉండగా, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ యజమానులు శాఖ మంత్రిగా వ్యవహరించి మృతుల కుటుంబాలకు రూ.40 లక్షల మాత్రమే ప్రకటించడం దుర్మార్గమన్నారు. అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో మృతులకు కోటి రూపాయలు, గాయపడ్డ కార్మికులకు 50 లక్షలు అందజేశారని, అదే మాదిరిగా ఠాగూర్ కంపెనీ మృతులు, క్షతగాత్రులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇంతమంది క్షతగాత్రులు కావటానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని, ఈ ప్రమాదంపై ప్రభుత్వం వెంటనే విచారణ చేసి దోషులను శిక్షించాలని కోరారు. కార్మికుల ప్రాణాలకు యాజమాన్యాలు ప్రాధాన్యత ఇవ్వకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని, కార్మిక కుటుంబాలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా పరిష్కారంకాని సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టిడిపి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తీసుకువెళ్లారు. అమరావతిలో శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు చైర్మన్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు భర్తీ, ప్రధాన సమస్యలను, సీఎం రిలీఫ్ ఫండ్ తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

254 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలిలో మద్యం షాపుల నుండి బెల్టు షాపులకు అక్రమంగా తరలి వెళ్తున్న 254 మద్యం బాటిళ్లను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. కొక్కిరాపల్లికి చెందిన ఒకరు, పెద్దపల్లికి చెందిన మరొకరు ఇద్దరి నుండి రూ.38,862 విలువ చేసే 254 బాటిళ్లను స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసినట్లు టౌన్ పోలీసులు విలేకర్లకు శనివారం సాయంత్రం తెలిపారు.

వర్షంతో వరి పంటకు నష్టం



నక్కపల్లిలో ఒరిగిన వరి పంట

ప్రజాశక్తి-నక్కపల్లి: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో శనివారం వర్షం కురవడంతో వరి పంటలు పలుచోట్ల దెబ్బతిన్నాయి. చివరి గింజలు చేతికందే సమయంలో వర్షం కురవడంతో రైతులు దిగులు చెందారు. తుఫాను ప్రభావంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మోస్తారు వర్షం కురిసింది. వర్షానికి, ఈదురు గాలులకు అక్కడక్కడ వరి చేలు నేల కొరిగాయి. వరి కోత దశకు చేరుకుందని ఇటువంటి సమయములో భారీ వర్షం, ఈదురు గాలులు వీస్తే అపార నష్టం జరుగుతుందని రైతులు దిగులు చెందుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, వరి పంట చేతికందే సమయంలో తుఫాన్ హెచ్చరిక కంటిమీద కునుకు లేకుండా చేస్తుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది వరి సాగు ఆశాజనకంగా ఉందని, ఇటువంటి సమయంలో వర్షం కురిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రావికమతం: ఆరుగాలం పండిన పంట ఒక్కసారిగా తుఫాను ప్రభావంతో వర్షం కురవడంతో రైతాంగం రోడ్డున పడ్డారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఈదురు గాలులతో కురుస్తున్న వర్షానికి రైతులు ఇప్పటికే కోసిన పంట పూర్తిగా నీట మునిగింది. కోయని పండిన పంట పూర్తిగా నేలమట్టమయింది. దీంతో రైతాంగం దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. శుక్రవారం వరకు ఎండలు కాయడంతో చాలామంది రైతులు వరి కోతలు కోశారు. మండలంలో 6.154 ఎకరాల వరి పంట సాగు చేయడం జరిగిందని, ఇప్పటికే 40 శాతం వరి పంట కోత కోయడం జరిగిందని వ్యవసాయ అధికారిని రూప అన్నారు. తుఫాన్ కారణంగా వరి కోతలు కోయవద్దని, కోసిన వారు చిన్నచిన్న కుప్పలుగా వేసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. కోసిన వరి పనలు తడిస్తే గింజ మొలక రాకుండా, తడిసిన గింజ రంగు మారకుండా ఉండేందుకు 50 గ్రాముల కళ్ళు ఉప్పు, ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని ఆమె తెలిపారు. తుఫాను కారణంగా గుమ్మాలపాడు, కొమెర, చినపాచిల, గర్నికం, కవగుంట, మరుపాక, మేడివాడ తదితర గ్రామాల్లో వరి పంట దెబతింది.

ఎస్.రాయవరం: మండలంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరి పంట కోతకు సిద్ధమైన రైతుల్లో టెన్షన్ మొదలైంది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుండి ప్రకృతి సహకరించడంతో వరి పంట పూర్తి స్థాయిలో పండడంతో రైతుల్లో ఆనందం నెలకొన్న దశలో . తుఫాన్ కారణంగా వరి పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోటవురట్ల: మండలంలో శనివారం తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం వరకు ఓ మోస్టరు వర్షపాతం నమోదయింది. ఇప్పటికే వరి పూర్తిస్థాయిలో పంట చేతికి వస్తున్న తరుణంలో వర్షాలు కురవడంతో పాక్షికంగా కొన్నిచోట్ల పంట నేల కొరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు సరోజిని మాట్లాడుతూ పంట నేల కొరిగిన చోట అదే విధంగా కోసిన పనలపై ఉప్పునీరు పిచికారి చేయాలని దీంతో గింజ మొలకెత్తి అవకాశం ఉండదన్నారు.

కురిసిన కొద్దిపాటి వర్షానికి పలుచోట్ల రోడ్లపై నీళ్లు నిలిచాయి, ఉదయం నుంచి కురిసిన వర్షం కారణంగా విద్యార్థులు ప్రయాణికులు ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.



కోటవురట్లలో తడిసిన వరి పైరు

బుచ్చయ్యపేట : పెంగల్ తుఫాన్ రైతులను నిండా ముంచింది. మండలంలోని రాజాం, మల్లాం, ఆర్.భీమవరం, బుచ్చయ్యపేట, కందిపూడి, దిబ్బిడి, చిన్నప్పన్నపాలెం, వడ్డాది తదితర గ్రామాల్లో శనివారం తెల్లవారుజాము నుండి వర్షం ప్రారంభమైంది. వర్షం, గాలి కారణంగా పొలాల్లో వరి పంట నేలకొరి వర్షపు నీటికి నీట మునిగింది. పంట చేతికి వచ్చే సమయంలో వర్షం కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

అన్నదాతల్లో ఆందోళన

దేవరాపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుఫానుగా మారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా వర్షం కురవడంతో గత మూడు నాలుగు రోజుల్లో కోసిన వరి పంటను పొలాల్లోనే కుప్పలుగా వేశారు. కొన్నిచోట్ల కోసిన వరి పంట పూర్తిగా ఎండకపోయినప్పటికీ వర్షం పడితే తడిసిపోతుందన్న ఉద్దేశంతో కుప్పలు వేయాల్సి వచ్చింది. లోతట్టు ప్రాంత రైతులైతే కూలీలను ఏర్పాటు చేసుకొని ఎత్తు ప్రదేశాలలో కుప్పలు వేసి, వర్షానికి తడవకుండా కుప్పలపై టార్పాలిన్లు కప్పారు.

కశింకోట : కశింకోట మండలంలో వరి రైతులకు ఫెంగల్ తుఫాన్ భయం వెంటాడుతుంది. మండలంలోని కశింకోట, తాళ్ళపాలెం, పల్లపు సోమవరం, నర్సింగబిల్లి, వై.తుని, గొబ్బూరు, అడ్డాము, వెదురుపర్తి, బయ్యవరం గ్రామాల్లో పంటలు కోత దశలో ఉన్నాయి. పంట చేతికి వచ్చి సమయంలో తుపాన్ రావడంతో పంటకు నష్టం వాటిల్లితుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కుర్చీ ఆడుతున్న విద్యార్థులు

విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు ప్రత్యేక బోధన ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ తెలిపారు.

2న మండలస్థాయి క్రీడా పోటీలు



ప్రత్యేక ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -రావికమతం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహించనున్నామని మేడివాడ జడ్పీ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, భవిత ప్రత్యేక ఉపాధ్యాయుడు జగన్నాథ నాయుడులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు డిసెంబరు 2న మేడివాడ జడ్పీ హైస్కూల్లో మండల స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు 50 మీటర్ల పరుగు పందెం, క్యారమ్స్, వ్యాసరచన, డ్రాయింగ్, డ్యాన్సు, తదితర పోటీలను నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు రావికమతం భవిత కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.



విద్యార్థులతో జెవివి ప్రతినిధులు

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: జనవిజ్ఞాన వేదిక నర్సీపట్నం శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీలలో పట్టణంలోని 20 ప్రభుత్వ ప్రైవేట్, పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి పరీక్షలలో ప్రైవేట్ పాఠశాలల సంబంధించి అమరావతి స్కూల్ మొదటి స్థానంలోనూ, డాన్ బాస్కోస్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ప్రభుత్వ పాఠశాల సంబంధించి ఏ.పీ రెసిడెన్షియల్ స్కూల్ మొదటి స్థానంలోనూ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మెయిన్) ద్వితీయ స్థానం లోను నిలిచాయి,. ఈ కార్యక్రమం ప్రారంభంలో జెట్టి ఎల్లమంద, శ్రీరామరాజు, గౌరు నాయుడు, జోగి నాయుడు తదితరులు ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జె.వి.వి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. త్రిమూర్తులురెడ్డి, విశ్వనాథం పాల్గొన్నారు.

శ్మశానాల అభివృద్ధికి చర్యలు

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టం శ్మశానాన్ని శనివారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం పట్టణంలో ఉన్న ఐదు శ్మశానాలను పార్కుల్లా అభివృద్ధి చేస్తామన్నారు. వీటిని సాయంత్రం వేళల్లో ప్రజలు సేదతీరే విధంగా రూపొందిస్తామని ఆయన తెలిపారు. బలిఘట్టం శ్మశాన అభివృద్ధి కోసం సీఎంఆర్ సంస్థ రూ. 20 లక్షలు కేటాయించి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. మిగిలిన నాలుగు శ్మశానాల అభివృద్ధికై సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకొచ్చిందని వివరించారు. నియోజకవర్గంలోని వంద పంచాయతీల్లో శ్మశానాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రమణ పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏటిగైరంపేటలో వర్షంలోనే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వలస ప్రాంతాలకు పనులకు వీళ్ళే వారికి మూడు నెలలకోసారి పింఛన్ తీసుకునే సౌకర్యం కల్పించారని చెప్పారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన 150 రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.60కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి.వి.రమణ, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ మేరీరోజ్, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కొప్పుల వెలగ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర, గ్రామ సర్పంచ్ బిడిజాన రామకృష్ణ, ఎంపీటీసీ చింతల సూర్యకాంతం, మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

మెడికల్ దుకాణాల్లో తనిఖీలు



పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

ప్రజాశక్తి-గొలుగొండ: మెడికల్ దుకాణాల్లో నాణ్యమైన మందులు విక్రయించాలని లేకుంటే కేసులు తప్పవని నర్సీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి హెచ్చరించారు. శనివారం గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, చోద్యం, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగులకు షాపుల్లో విక్రయించే మందులను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి షాపుల్లో విక్రయించే మందులను అనుమానంతో ల్యాబ్‌కు పంపారు.

కొత్త గృహాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న తహాశీల్దార్

ప్రజాశక్తి-కోటవురట్ల: శిథిలావస్థకు చేరుకున్న ఇంటి స్థానంలో కొత్త ఇల్లు నిర్మించాలని అన్నవరం గ్రామంలో శనివారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా హాజరైన తహసిల్దారు తిరుమల బాబును గ్రామంలో పలువురు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన పౌరహక్కుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అదేవిధంగా గ్రామస్థాయి అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఎస్సీ కాలనీ వద్ద మురుగు కాలవ దుర్గంధం వెదజల్లుతుండడంతో పాటు దోమలు బెడద అధికంగా ఉందని పలువురు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో సామాజిక సంక్షేమ అధికారి రాజేశ్వరి, ఆర్ఐ ఊర్ధవరావు, హెడ్ కానిస్టేబుల్ వరహాలు, మాజీ ఎంపీటీసీ రాంబాబు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వంపై అభినందనలు



బహుమతులు ఇస్తున్న బండారు

ప్రజాశక్తి -మాడుగుల: కూటమి ప్రభుత్వంలో టీడీపీ అమలు చేస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. ఈ మేరకు మాడుగుల మండలంలో 69 పోలింగ్ బూతులు గాను పొంగలిపాక గ్రామం 63శాతం సభ్యత నమోదుతో ప్రథమ స్థానంలో నిలవగా, పోతనపూడి 56శాతంతో ద్వితీయ స్థానం, గాదిరాయి 40 శాతంతో తృతీయ స్థానంలో నిలిచాయి. సభ్యత్వ నమోదులో జిల్లాస్థాయిలో మాడుగుల ముందంజలో ఉంది. 69 పోలింగ్ బూతులలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేసిన గ్రామానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు జగ్గారావు, దేముడు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి -నక్కపల్లి: డిసెంబర్ నెలలో జరగనున్న మెగా పేరెంట్ -టీచర్ మీటింగ్‌కు ఉపాధ్యాయులంతా సన్నద్ధం కావాలని డిప్యూటీ టిఈఓ పి.అప్పారావు సూచించారు. మండలంలోని గొడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని విద్యాబోధన, మధ్యాహ్న భోజనం పథకం, ఆర్వో ప్లాంట్, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ నెలలో నిర్వహించనున్న మెగా పేరెంట్ -టీచర్ సమావేశంపై చర్చించారు. హెచ్ ఎం జి అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంమంత్రి అనితకు వినతి

ప్రజాశక్తి-ఎస్. రాయవరం: మేజర్ పంచాయితీ దార్లపూడి గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జనసేన నాయకులు రంగనాథ్, సతీష్‌లు హెూంమంత్రి అనితకు వినతిపత్రం అందచేశారు. శుక్రవారం నర్సీపట్నం -అడ్డురోడ్డు రోడ్డు శంఖుస్థాపనకు దార్లపూడి వచ్చిన హెూంమంత్రి అనితను జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం గ్రామానికి ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఏటికొప్పాక మీదుగా పులపర్తి జాతీయ రహదారిని కలిపే రోడ్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ మెడికల్ ఆఫీసర్ ఎస్ ఎస్ వి శక్తి ప్రియ మాట్లాడుతూ, స్త్రీలలో గర్భసంచి, రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆరోగ్య విస్తరణ అధికారి టి నాగేశ్వరరావు, పి హెచ్‌ఎన్‌ఎం రత్న సఖి, పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషిచేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. రాడిసన్ బ్లూ హోటల్లో సన్ కలర్స్ -2024 ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నచ్చిన రంగంలో రాణించాలంటే ఏకాగ్రత, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. పర్యాటక రంగంలో విశేష అవకాశాలు, ఉపాధి లభిస్తుందని చెప్పారు. గౌరవఅతిథి కంకటాల మల్లికార్జునరావు మాట్లాడుతూ, సన్ అంటే ఒక బ్రాండ్ అని, ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టిన ఘనత ఈ విద్యా సంస్థకు దక్కుతుందన్నారు. సన్ సిఎమ్‌డి శ్రీకాంత్ జాస్తి మాట్లాడుతూ, 20 ఏళ్ల క్రితం సన్ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక, పురాతన సంప్రదాయాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. నిర్వాహకులు ఎమ్మెల్యే గంటాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గంటా శారద, రవితేజ, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



సన్ కలర్స్ ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న గంటా

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -కొత్తకోట:వివిధ చలానాలు చెల్లించని వాహనాల పై ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. శనివారం కొత్తకోట సమీపంలో పలు వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, చలానాలు వాహన దారులు మూడు కంటే ఎక్కువ కట్టకుండా తిరుగుతున్న వారిని గుర్తించి వాటిని సీజ్ చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు లేకపోతే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వలనే ఎక్కువ మంది మరణిస్తున్నారని గుర్తు చేసారు. ఐయస్ఐ మార్కుతో వున్న హెల్మెట్ ధరించాలని సూచించారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు